మధ్యతరగతి విద్యార్థులు నష్టపోతారు



మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేస్తే మధ్యతరగతి, మెరిట్ కలిగిన విద్యార్థులు నష్ట పోతారు. రూ.లక్షల్లో ఫీజులు చెల్లించి డాక్టర్ కోర్సు చదవ లేక పేద మధ్య తరగతి విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారు. అదే కొత్త కళాశాలలు ప్రారంభమయితే అదనంగా సీట్లు పెరుగుతాయి, సామాన్య విద్యార్థి కూడా చదువుకోవడానికి అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఏదైనా ప్రజలకు మంచి జరుగుతున్నప్పుడు స్వాగతించాలి, అవసరమైతే అన్ని రకాల సదుపాయాలను కల్పించి విద్యను అందించాలి. అంతేకాని కళాశాలలను ఎత్తివేయడం సరికాదు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వలన ఎంతోమంది విద్యార్థులు నష్టపోతున్నారు. ప్రభుత్వం పునరాలోచించి తగు నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.

– సి.రామ్ ప్రసాద్, విద్యార్థి తండ్రి, ఆదోని సెంట్రల్



మెడికల్ కాలేజీ పనులు ఆపేయడం అన్యాయం



గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వైద్య కళాశాలలను మంజూరు చేసింది. నిర్మాణ పనులు కూడా వేగవంతంగా జరిగాయి. వైద్య విద్య చదవాలనుకునే వారు చాల మంది నిరుపేదల విద్యార్థులు కూడా సంతోషపడ్డారు. మన జిల్లాలోనే వైద్య విద్యను చదువుకోవచ్చునని ఆశ పడ్డారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం వైద్య కళాశాల నిర్మాణ పనులు ఆపేయాలని చెప్పడం, ప్రైవేటుకు అప్పగించాలని చూడటం చాల అన్యాయం. వైద్య విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు. కార్పొరేట్‌లో వేలకు వేలు డబ్బులు కట్టి చదువుకోలేని పేద విద్యార్థులు చాల మంది ఉన్నారు. జిల్లాలోనే వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తే నిరుపేదలకు చాల మంది ఉపయోగపడుతోంది. కూటమి ప్రభుత్వం వైద్య విద్యను ప్రోత్సహించి విద్యార్థులకు న్యాయం చేసేలా పునరాలోచన చేయాల్సి ఉంది.

–వీరేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి, కోసిగి

క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి



ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: మండల పరిధిలోని ఉపాధ్యాయుల సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, శేఖర్ కోరారు. ఆదివారం ఎంఈఓ ఆంజనేయులుకు ఎస్టీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో అదనపు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగరాజు, బసవరాజు, ప్రసన్నరాజు, అడివన్న, తిమ్మరాజు, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



బియ్యం, విరాళాలు, చీరలను జిల్లా నాయకులకు అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విజయవాడ వరద బాధితులకు చేయూత నిచ్చేందుకు ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సేకరించిన విరాళాలు, బియ్యం, వస్త్రాలను పంపుతున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, రాజీవ్ తెలిపారు.ఈ మేరకు సేకరించిన విరాళాలను విజయవాడకు పంపేందుకు ఆదివారం స్థానిక కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, నాయకులు భాస్కర్‌యాదవ్, రంగన్నలకు అందజేశారు.

ఘనంగా ఇంజినీర్ల దినోత్సవం



పంచాయతీరాజ్ విశ్రాంత ఇంజినీర్ ఎల్ఎస్‌కేఎం గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: లయన్స్ క్లబ్, వామ్, అవోపా ఆధ్వర్యంలో భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య, జాతీయ ఇంజినీర్ల దినోత్సవాన్ని ఆదివారం స్థానిక లయన్స్ క్లబ్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ డాక్టర్ వై.గోపీనాథ్, ప్రసాదరావు అధ్యక్షతన ఆదోని పట్టణానికి అత్యుత్తమ సేవలందించిన ప్రముఖ పంచాయతీరాజ్ విశ్రాంత ఇంజినీర్ ఎల్ఎస్‌కేఎం గౌడ్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్‌గుప్తా, కోశాధికారి శంకరమ్మ, విశిష్ట సభ్యులు వనపరాజు, మల్లికార్జునగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు యువతి



సీఐ సమక్షంలో కుటుంబ సభ్యులకు యువతిని అప్పగించిన దృశ్యం

ఆదోని అర్బన్: పట్టణంలో కల్లుబావికి చెందిన రోజమ్మ అనే యువతిని ఆదివారం టూటౌన్ సీఐ సూర్యమోహనరావు కుటుంబ సభ్యులకు అప్పగించారు. రోజమ్మ ఆరు నెలల నుంచి మంత్రాలయంలోని ఓ హోటల్‌లో పనిచేస్తోంది. ఇటీవల ఆమె కనబడకుండా పోవడంతో అదృశ్యం కేసు నమోదు చేసుకున్న టూటౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎట్టకేలకు ఆదివారం ఆ యువతిని అప్పగించారు.

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న ధర్మకర్త

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాలో ఆదివారం గ్యారతారీఖ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవు రోజుతో పాటు సోమవారం మిలాదున్‌నబీ కలిసి రావడంతో గ్యారతారీఖ్ వేడుకలకు భక్తులు అధికంగా వచ్చారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు. భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు. మిలాదున్‌నబీ వేడుకల సందర్భంగా దర్గాను, దర్గాలోని మజ్జీద్‌ను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వచ్చిన భక్తులందరికీ ధర్మకర్త అన్నదానం ఏర్పాటు చేశారు.

భావి క్రీడాకారుల ఆశలపై నీళ్లు

- పోటీలు నిర్వహించకుండానే క్రీడాకారుల ఎంపిక
- గతంలో ఆడి గెలిచిన వారికే అవకాశం
- క్రీడలకు దూరమవుతున్న ఆసక్తి ఉన్న విద్యార్థులు
- మరుగున పడుతున్న ప్రతిభావంతులు



క్రీడలకు ఎటువంటి ఏర్పాట్లు చేయని క్రీడా మైదానం (ఫైల్)

పెద్దకడబూరు : చదువులతో పాటు విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని ప్రతి సంవత్సరం ప్రభుత్వం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తోంది. ఈ పోటీలలో పాల్గొనడానికి పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తోంది. ఎస్‌జీఎఫ్‌ఐ ఆరోగ్యకరమైన పోటీని, క్రీడాకారులలో సామాజిక, సాంస్కృతిక చైతన్యాన్ని నింపడానికి, నాణ్యమైన శారీరక విద్యను అందించడానికి ఎంతో దోహదపడుతుంది. అయితే విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాల్సిన ఉపాధ్యాయులు క్రీడల్లో ఉదాసీనత ప్రదర్శిస్తున్నారు. క్రీడలు జరపకుండానే విద్యార్థుల ఎంపిక కానిచ్చేస్తున్నారు. దీనివల్ల క్రీడలపై ఎంతో ఆసక్తి ఉన్న చాలా మంది విద్యార్థుల ఆశలపై నీళ్లుచల్లుతున్నారు.

పాఠశాల నుంచి ఒకరిద్దరు మాత్రమే

మండల కేంద్రంలో ఎస్‌జీఎఫ్‌ఐ గేమ్స్ మండల కన్వీనర్(పీడీ) స్వర్ణలత ఆధ్వర్యంలో ఈనెల 11, 12 తేదీల్లో నిర్వహించారు. మండల స్థాయిలో జరిగే ఈ పోటీలలో మండలంలోని కస్తూర్బా, ఆదర్శ పాఠశాలలతో పాటు ఉన్నత పాఠశాలలు 10, ప్రాథమికోన్నత 28 పాఠశాలల నుంచి ఆసక్తిగల విద్యార్థులు పాల్గొనాల్సి ఉంది. అయితే మొదటి రోజున అమ్మాయిలకు పోటీలు నిర్వహించగా మొక్కుబడిగా కొన్ని పాఠశాలల విద్యార్థినులను మాత్రమే, అది కూడా పాఠశాలకు ఇద్దరు లేదా ముగ్గురిని మాత్రమే తీసుకు వచ్చి ఎంపిక పోటీలు నిర్వహించకుండానే సెలక్షన్ చేపట్టారు. రెండోరోజు కూడా బాలుర ఎంపికలో కూడా అదేతంతు. మొత్తం క్రీడలకు కలిపి దాదాపు 200 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు.

క్రీడలకు ఏర్పాట్లు కరువు

ముందుగా విద్యార్థులను సెలెక్ట్ చేయాలంటే వారితో గేమ్స్ ఆడించాలి. గేమ్స్ ఆడించాలంటే మైదానంలో అందుకు కావాల్సిన కోర్టు ఉండాలి. ఇక్కడ కబడ్డీ ఆడిద్దామంటే కోర్టులేదు. కోకో ఆడిద్దామంటే కోర్టు లేదు కదా కనీసం పోల్స్‌కూడా లేవు. లాంగ్‌జెంప్, హైజెంప్ ఆడిద్దామంటే పిట్ కూడా లేదు. దీంతో సంబంధిత పీడీలకు వాటిని తయారు చేసుకునే ఓపిక లేక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ మొక్కుబడిగా త్రో బాల్, డిస్క్ త్రో, రన్నింగ్ రేస్, షాట్‌పుట్ తదితర క్రీడలు నామమాత్రంగా నిర్వహించి పీడీలకు అనుకూలమైన వారిని లేదా గతంలో క్రీడల్లో పాల్గొన్న విద్యార్థుల పేర్లను మాత్రమే నమోదు చేసుకుని, క్రీడలు నిర్వహించినట్లు నోట్ చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో క్రీడల్లో నైపుణ్యం ఉన్న విద్యార్థులను వెలికి తీయాల్సిన వారే నిర్లక్ష్యంతో ఈ విధానానికి పాల్పడడం విమర్శలకు దారితీస్తోంది. ఇదేమిటని ప్రశ్నిస్తే వారు దాటవేస్తూ ఈ క్రీడలు నిర్వహించడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఫండ్ లేదని, అందుకే ఇలా నిర్వహిస్తున్నామని సమాధానం చెబుతున్నారు.

గతంలో ఆడి గెలిచిన వారినే సెలెక్ట్ చేసుకున్నాం



ఎస్‌జీఎఫ్‌ఐ క్రీడలు నిర్వహించడానికి ఫండ్ లేదు. సరైన వసతులు, మైదానం లేదు. అందుకే కబడ్డీ, త్రో బాల్, డిస్క్ త్రో వంటి క్రీడలను నిర్వహించి అందులో నైపుణ్యం కలవారిని సెలెక్ట్ చేసుకున్నాం. మరికొన్ని క్రీడలలో గతంలో ఆడి గెలిచిన వారినే సెలెక్ట్ చేసుకున్నాం.

– ఎస్‌జీఎఫ్‌ఐ గేమ్స్ మండల కన్వీనర్(పీడీ) స్వర్ణలత

నేడు ఉచిత వైద్య శిబిరం

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలోని పురపాలక ఉన్నత పాఠశాలలో నేడు ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆదోని డివిజన్ ఎస్టీయూ నాయకులు సి.నాగరాజు, జి. వీరచంద్ర యాదవ్, వి.రమేష్ నాయుడు ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ మధు హాస్పటల్ సౌజన్యంతో గుండె, ఆర్థో, కంటి, జనరల్ మెడిసిన్ డాక్టర్లతో పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పేద విద్యార్థి చదువుకు చేయూత

ఎమ్మిగనూరుటౌన్: గోనెగండ్ల మండల పరిధిలోని ఐరన్‌బండ గ్రామానికి చెందిన మెరిట్ విద్యార్థి పాండురంగకు లా కోర్స్ ఫీజుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని బుట్టా ఫౌండేషన్ ద్వారా ఆదివారం మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక అందజేశారు. ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం బుట్టా ఫౌండేషన్ చేయూతనందిస్తున్నట్లు తెలిపారు.

వచ్చే నెల 20న రగ్బీ ప్రైజ్ మనీ పోటీలు

కర్నూలు (టౌన్): వచ్చే నెల 20 నుంచి 22వ తేదీ వరకు ఖేలో ఇండియా ఆధ్వర్యంలో రగ్బీ ప్రైజ్ మనీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బి.రామాంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15, అండర్ -18 విభాగాల్లో బాలికలకు, ఆపై వయస్సు వారికి మహిళల విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. పోటీల వేదిక త్వరలో వెల్లడిస్తామన్నారు.

ఆదోని వాసికి సర్వేపల్లి నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఎస్.విజయలక్ష్మి

ఆదోని అర్బన్: ఆదోని వాసికి దక్షణాది రాష్ట్రాలకు సంబంధించి సర్వేపల్లి రాధాకృష్ణ నేషనల్ అవార్డు దక్కింది. పట్టణానికి చెందిన ఎస్.విజయలక్ష్మి అనంతపురం జిల్లా డి.హీరేహాల్ ఎంజేపీ గురుకుల పాఠశాల బాలికల హైస్కూల్‌లో పీఈటీ హిందీ బోధకురాలిగా పనిచేస్తున్నారు. తిరుపతిలో శనివారం దక్షణాది నాలుగు రాష్ట్రాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ప్రదానోత్సవంలో అవార్డును మాజీ రాష్ట్రపతి, స్వర్గీయ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ మనవడు డాక్టర్ సుబ్రహ్మణ్యశర్మ, ద్రావిడ యూనివర్సిటీ మాజీ వీసీ రత్నయ్య, ట్రస్టు చైర్మన్ కరీముల్లా చేతులమీదుగా అందుకున్నారు. అవార్డు అందుకున్న ఎస్.విజయలక్ష్మిని ఆదివారం ఆదోనిలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆదోని యూటీఎఫ్ గౌరవాధ్యక్షులు రాజ్‌కుమార్, ఆదోని మాజీ ప్రిన్సిపాల్ కరాడే విజయ్‌కుమార్, మాధవిభాయ దంపతులు, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

రోటరీ ఆధ్వర్యంలో జోనల్ స్థాయి పోటీలు



జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న అతిథులు

ఆదోని అర్బన్: స్థానిక మల్లికార్జున విద్యాలయ హైస్కూల్ ఆవరణలో ఆదివారం ఆదోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఇండోర్ ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో జోనల్ స్థాయిలోని 50 పాఠశాలల నుంచి వెయ్యి మంది విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొని, ప్రతిభ కనబరిచారని రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు సందీప్‌రెడ్డి, డాక్టర్ సైపుల్లా, రోటరీ క్లబ్ యూత్ యాక్టివిటీస్ ఇన్‌చార్జి సాబీర్‌అహ్మద్ తెలిపారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి మల్లికార్జున విద్యాలయ కరస్పాండెంట్ సుగూరప్ప, అడ్వైజరీ మెంబర్ విశ్వనాథ్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. చెస్, డ్రాయింగ్, రూబిక్ క్యూబ్, క్విజ్, ఎలిక్యూలేషన్ పోటీలను నిర్వహించగా.. డ్రాయింగ్‌లో కిడ్డీస్ రూట్స్ పాఠశాల 7వ తరగతి విద్యార్థిని అనన్య మొదటిస్థానాన్ని, రెండవ, మూడవ స్థానాలను అక్షరశ్రీ పాఠశాల విద్యార్థి విష్ణుసాయి సాధించారు. అదేవిధంగా క్విజ్, చెస్, ఎలిక్యూషన్, రూబిక్ క్యూబ్స్‌లలో ప్రతిభను కనబరిచిన ఆయా పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులకు రోటరీ క్లబ్ వారు ప్రశంసా పత్రంతోపాటు మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు జీవన్ సింగ్, సునీల్‌రెడ్డి, భరత్‌షా, విట్టా మురళీధర్, రాయచోటి సుబ్బయ్య, శ్రీధర్‌రెడ్డి, బసవరాజు, ఉమేష్‌పాయి తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌యార్డ్‌లో సౌకర్యాలు కల్పించండి



పట్టణంలోని మార్కెట్ యార్డ్ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో రైతుల కోసం కనీస సౌకర్యాలు కల్పించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం(ఏఐకేఎంఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యన్న డిమాండ్ చేశారు. ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో ఆదివారం మార్కెట్ యార్డ్ అధికారులు లక్ష్మి, ఎర్రిస్వామిలకు వినతి పత్రం అందజేశారు. యార్డ్‌లో రైతుల కోసం ఉచిత భోజనం, క్యాంటిన్ సౌకర్యాన్ని, విశ్రాంతి భవనం, మంచినీటి వసతి, మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. మార్కెట్‌లో పత్తి కొనుగోలును ప్రారంభించాలని, దళారుల దోపిడీ లేకుండా నివారించాలని, పాత షెడ్లను పునర్నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

ఆదోని అర్బన్/ఆదోని సెంట్రల్: పట్టణంలోని శ్రీ జీవేశ్వర విద్యాలయంలో 2001-2002 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఎక్కడో స్థిరపడి అందరూ ఒక్కచోట చేరుకుని గత అనుభవనాలను గుర్తు చేసుకుని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. 22 సంవత్సరాల తర్వాత అందరూ పాఠశాలలో మధుర స్మృతులను స్మరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు నాగరాజు, వెంకటేష్, నరసింహులు, నాగమణి, శాంతకుమారి, ధనుంజయ, కృపానంద, ఉమామహేశ్వరిలను సన్మానించారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థులకు తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సురేంద్ర, నరసింహులు, చంద్రహాస్, చంద్ర, రామకృష్ణ, ఉమా, రేఖ, తదితరులు పాల్గొన్నారు.

అనవసరంగా మందు వాడితే అనర్థం

- పురుగు మందుల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి
- చీడపీడలకు అనుగుణంగా వాడాలి
- పిచికారీ సమయంలో జాగ్రత్తలు తప్పనిసరి
- వ్యవసాయాధికారుల సలహా మేరకే వినియోగించాలి



గోనెగండ్లలో సాగుచేసిన వరి పైరు

గోనెగండ్ల : సీజన్‌కు అనుగుణంగా పంటలకు చీడ పీడలు, తెగుళ్లు సోకుతుంటాయి. ఒకటి రెండు పురుగులు కనిపించగానే రైతన్నలు పైరుపై వివిధ రకాల పురుగు మందులు పిచికారీ చేసేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పైరుకు మేలు చేసే మిత్ర పురుగులు సైతం చనిపోతున్నాయి. పైరులో అధికంగా పురుగులు ఉన్నప్పుడు మాత్రమే నివారించేందుకు మందులను వినియోగించాలి.

ఎంపికలో జాగ్రత్తలు అవసరం

పంటలను ఆశించే పురుగులను నివారించేందుకు తమ మందులు వాడాలని వివిధ కంపెనీలు ప్రచారం చేస్తుంటాయి. అయితే ఏ మందు పడితే ఆ మందును పైరుపై పిచికారీ చేస్తే ఫలితం ఉండదు. ఇప్పటి వరకు దుకాణదారులు, ఏ మందు ఇస్తే అదే వాడడం రైతులకు పరిపాటిగా మారింది. అయితే ఇలాంటి చర్య రైతుకు నష్టాన్నే కలిగిస్తుందని వ్యవసాయశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు.

గుర్తింపు పొందిన కంపెనీలవే వాడాలి

గుర్తింపు పొందిన కంపెనీల పురుగు మందులనే రైతులు వాడాలి. మందు డబ్బాల మూతలను నోటితో తీయకూడదు. మందు ద్రావణాన్ని డ్రమ్ములో కానీ, బకెట్లో కానీ కలిపిన తర్వాతనే స్ప్రేయర్లలో నింపుకోవాలి. మందులను నీటిలో కలిపేటప్పుడు చేతులకు గ్లౌజులతో పాటు రక్షణ దుస్తులు ధరించాలి. ఆరోగ్యం సరిగా లేని వారు మందులు పిచికారీ చేయరాదు. కంటిలో పడకుండా రైతులు కళ్లజోడు ధరించడం ఉత్తమం. అనుకోకుండా పురుగు మందు తుంపర్లు కంటిలో పడితే వెంటనే కళ్లను చల్లటి నీళ్లతో బాగా కడిగి వైద్యుడిని సంప్రదించాలి. శరీరంపై గాయాలు ఉన్నవారు మందులు పిచికారీ చేయరాదు. గాలికి వాలుగా పిచికారీ చేయడం ఎంతో ఉత్తమం. పిచికారీ అనంతరం రెండు మూడు సార్లు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలి. పశువుల మేత కోసం పెంచిన పైర్లలో మందులు వినియోగించకూడదు. కల్తీ మందులను అసలు వాడకూడదు.

మోతాదు మేరకే వినియోగించాలి



వ్యవసాయాధికారుల సూచనలు మేరకే తెగుళ్లు, పురుగుల నివారణకు మందులను వాడాలి. తక్కువ మందు వాడితే అది పనిచేయక పురుగులు చావవు. ఎక్కువ మందులు వాడితే పంటకు నష్టం కలిగించడంతో పాటు ఆ రైతులకు పెట్టుబడి పెరుగుతుంది. పురుగులకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి, తెగుళ్ల వ్యాప్తి అధికమవుతుంది. పైరుపై ఎక్కువ సార్లు మందులను పిచికారీ చేయడం మంచిదికాదు.

- మహమ్మద్ ఖాద్రీ, ఏడీఏ, ఎమ్మిగనూరు

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు మూల విరాట్‌లకు జలాభిషేకం, సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, కుంకుమార్చన, మహా మంగళహారతి, నైవేద్య సంమర్పణ తదితర కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారిని దర్శించుకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వక్ఫ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలి



సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: వక్ఫ్ బోర్డ్ చట్ట సవరణను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఇన్సాఫ్ కమిటీ పట్టణ అధ్యక్షుడు సమీవుల్లా, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రంగన్న, పంపణ్ణగౌడ్, భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని కోరుతూ ఇన్సాఫ్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి సోమప్ప సర్కిల్‌లో ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ వక్ఫ్ బోర్డ్ చట్టాన్ని సవరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం 40 ప్రతిపాదనలను పార్లమెంట్‌లోని జాయింట్ యాక్షన్ కమిటీకి పంపడం జరిగిందని, తక్షణం ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా 9.40లక్షల ఎకరాలు కలిగిన 3వ అతిపెద్ద సంస్థ వక్ఫ్‌బోర్డ్ అన్నారు. బిల్లు సవరణ పేరుతో అన్యమతస్తులను వక్ఫ్ బోర్డ్‌లో స్థానం కల్పించాలని చూస్తున్నారన్నారు. ఇలా చేయడం వక్ఫ్ లక్ష్యాలను విస్మరించినట్లే అన్నారు.

ఆ రహదారిలో ప్రయాణం నరకప్రాయం

ఆదోని రూరల్: ఏళ్లు గడుస్తున్నా గ్రామీణ ప్రాంతాల రోడ్ల పరిస్థితి మాత్రం మారడం లేదు. గ్రామాలకు వెళ్లే రహదారులు గుంతలమయంగా అధ్వానంగానే ఉన్నాయి. దీంతో ఆ రహదారుల్లో ప్రయాణించేందుకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండలంలోని ధణాపురం-నాగనాథనహళ్లి రహదారి గుంతలయంగా, అధ్వానంగా మారింది. పెద్దపెద్ద గుంతలు పడడంతో ఈ రహదారిలో ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపేందుకు కూడా అధికారులు ముందుకు రావడం లేదు. వర్షం పడినప్పుడల్లా గుంతల్లో నీరు నిలిచి గుంతలు కనిపించక మోటార్‌సైకిల్‌పై ప్రయాణించేవారు కింద పడి గాయాలపాలైన ఘటనలు కూడా ఉన్నాయి. ఎన్ని సంవత్సరాలు గడిచినా ఈ రహదారిని బాగుచేసే నాథుడేలేడని ధణాపురం, నాగనాథనహళ్లి గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారిలో ఏర్పడిన గుంతలను పూడ్చి రహదారికి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



గుంతలమయంగా ఉన్న ధణాపురం-నాగనాథనహళ్లి రహదారి

దళిత మహిళను కొట్టిన వారిని శిక్షించాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్

గోనెగండ్ల : పెద్దకడబూరు మండలంలోని కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మను కొట్టిన వారిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, అడ్వకేట్ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రం గోనెగండ్లలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గోవిందమ్మ కుమారుడు కులాంతర వివాహం చేసుకున్నాడని చాకలి ఎర్రన్న, చాకలి ముకప్పలతో పాటు బంధువులు మరికొంత మంది గోవిందమ్మను స్తంభానికి కట్టేసి కొట్టారన్నారు. జిల్లా ఎస్పీ, కలెక్టర్లు కల్లుకుంట గ్రామాన్ని సందర్శించి బాధితులను పరామర్శించి దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దస్తగిరి, భక్త కన్నప్ప, రంగన్న, రంగస్వామి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బాధితురాలికి పరామర్శ

పెద్దకడబూరు /కోసిగి/ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు గోవిందమ్మను ప్రజాసంఘాల నాయకులు ఆదివారం పరామర్శించారు. సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గౌస్‌దేశాయ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్, కోసిగి మండల కార్యదర్శి అంజి, ఎమ్మిగనూరుకు చెందిన నాయకులు రాధాకృష్ణ, కేవీ నారాయణ, నాయకులు గోవిందు, పెద్దకడబూరుకు చెందిన శ్రీనివాసులు, నరసన్న, ప్రసాద్ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

కల్లుకుంట కేసులో మరో 50 మందిని చేర్చాలి

ఎమ్మిగనూరురూరల్: పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళ గోవిందమ్మపై దాడి కేసులో అదనంగా మరో యాభై మందిని నిందితులుగా చేర్చాలని నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బతుకమ్మ, డివిజన్ అధ్యక్షుడు సుమాల చార్లెస్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు గోవిందమ్మను పరామర్శించారు. అనంతరం విలేకరుతో వారు మాట్లాడుతూ గ్రామాల్లో నేటికి కుల వివక్ష, అగ్రవర్ణాల వారి పెత్తనం కొనసాగుతుందని చెప్పారు. గోవిందమ్మను స్తంభానికి కట్టేసి విచక్షణ రహితంగా, దుస్తులు లేకుండ కొట్టడం దారుణం అన్నారు. ఇక్కడ పరిస్థితులను చూస్తుంటే బీహార్ రాష్ట్రం గుర్తుకు వస్తుందని చెప్పారు.